గంజాయి దందా గుట్టురట్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

- జగిత్యాలలో ఐదుగురు నిందితులు అరెస్ట్
- 12 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 10: గంజాయి దందా గుట్టురట్టయింది. ఆంధ్రా ఒరిస్సా బార్డర్ నుంచి జగిత్యాలకు గంజాయి తీసుకొచ్చిన జిల్లాకు చెందిన ముఠా పోలీసులకు చిక్కింది. ఈ మేరకు జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం సాయంత్రం విలేకరులతో వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం పూడూరుకు చెందిన ఎడమలపల్లి సాయికుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, అఖిల్, గౌరాపూర్‌కు చెందిన ఎడపెల్లి సాకేత్, జగిత్యాల మండలం ధరూర్‌కు చెందిన పాల రాజ్‌కుమార్ గంజాయికి అలవాటు పడ్డారు. బానిసలుగా మారారు. జల్సాలకు డబ్బుల కోసం గంజాయిని విక్రయించాలని నిర్ణయించుకొని ముఠాగా ఏర్పడ్డారు. రూ.43వేలు సమకూర్చుకున్నారు. ఎడమలపెల్లి సాయికుమార్, తుడుం సాయి ఈ నెల 2న బైక్‌పై ఆంధ్రా ఒరిస్సా బార్డర్‌కు వెళ్లి డబ్బులు చెల్లించి 16కిలోల గంజాయిని కొనుక్కొని 3న పూడూరుకు చేరుకొని శివారులోని చెట్ల పొదల్లో దాచిపెట్టారు. అందులో నుంచి నాలుగు కిలోల గంజాయిని హైదరాబాద్‌లో అమ్మేందుకు అఖిల్ తీసుకెళ్లగా, మిగతా 12 కిలోల గంజాయిని ఐదుగురు వ్యక్తులు పంచుకునేందుకు పూడూరు శివారులో పొదల వద్దకు వెళ్లారు. సమాచారం మేరకు కొడిమ్యాల ఎస్ఐ సందీప్ తన సిబ్బందితో దాడి చేసి ఎడమలపల్లి సాయికుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, ఎడిపెల్లి సాకేత్, పాల రాజుకుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అఖిల్‌ను సైతం త్వరలోనే పట్టుకుంటామని వివరించారు. గంజాయి తాగినా, రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రయవిక్రయాలు, రవాణా, వినియోగం వంటి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, ఎమలపల్లి సాయికుమార్‌పై తూర్పు గోదావరి జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై 2021లో, ధరూర్‌కు చెందిన పాల రాజ్‌కుమార్‌పై మల్యాల ఠాణాలో కేసులున్నాయని తెలిపారు. నిందితులను పట్టుకున్న మల్యాల ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, కానిస్టేబుల్ తిరుమల్, రాజు, వినోద్, మల్యాల సీఐ నీలం రవి, డీఎస్పీ రఘుచందర్‌ను ఎస్పీ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యానగర్, సెప్టెంబర్ 10 : ప్రభుత్వ గుర్తింపు పొందిన హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు పోస్టల్ శాఖ స్కాలర్‌షిప్‌లు అందిస్తుందని, ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కే శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పథకం కింద ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.6వేల చొప్పున స్కాలర్ షిప్‌లు అందజేస్తారని, ప్రతి మూడు నెలలకోసారి రూ.1,500 చొప్పున అందుతుందని వివరించారు. 13వ తేదీలోగా సమీప పోస్టాఫీసు లేదా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

ఉద్యోగ మేళాకు భారీ స్పందన

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 10 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతిబా పూలే మైదానంలో లక్ష్ ఫౌండేషన్ నిర్వాహకుడు విద్యావేత్త డాక్టర్ ముస్తాక్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు భారీ స్పందన లభించింది. ఉదయం నుంచి నిరుద్యోగులు దాదాపు 5000 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా సాయంత్రం వరకు 416 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఇందులో టెక్ మహీంద్రా, గూగుల్, వాకో, జెన్‌ప్యాక్ట్, హెచ్‌సీఎల్ వంటి 35కి పైగా కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- ప్రభుత్వ లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి
- కలెక్టర్ సత్య ప్రసాద్
- బ్యాంకు అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష

జగిత్యాల, సెప్టెంబర్ 10: ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు రుణ సదుపాయం తక్షణమే అందించాలని ఆదేశించారు. జూన్ 30 నాటికి జిల్లాలోని బ్యాంకు రుణ లక్ష్యాలు, పలు అంశాలపై బ్యాంకు అధికారులు, సంబంధిత ఏజెన్సీ సంస్థలతో మంగళవారం కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై బ్యాంకర్లు, అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రుణాలు రూ.868 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వీధి వ్యాపారులకు సంబంధించి మూడో విడతలో 1290 మందికి రుణాలు మంజూరు చేసామని తెలిపారు. అలాగే సూక్ష్మ చిన్న, మధ్యత రహా రుణాల కింద రూ.241 కోట్లు ఇచ్చినట్లు వివరించారు. పీఎంఎఫ్ఎంఈ కింద ఇప్పటికే 328 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. కాగా, ఆశించినంత పురోగతి సాధించని బ్యాంకులతో నిరంతరం సమీక్షిస్తూ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న స్వశక్తి సంఘాలకు రూ.242 కోట్లు, పట్టణ ప్రాంత సంఘాలకు రూ.23 కోట్లు అందించామని తెలిపారు. సరైన వివరాలు లేకుండా బ్యాంకు అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు సమీక్షకు రావొద్దని సున్నితంగా మందలించారు. కొన్ని స్కీంలలో జిల్లాలో ప్రైవేటు బ్యాంకులు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాం కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజినల్ హెడ్ అరుణ సబిత, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, ఆర్బీఐ ఎల్‌డీవో రెహమాన్, డీఎవో వాణి, డీఆర్డీవో రఘువరన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్‌తో పాటు వివిధ బ్యాంకుల ఉన్నత అధికారులు పాల్గొన్నారు

బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మంగళవారం అదనపు కలెక్టర్, మెడికల్ ఆఫీసర్లకు, హెల్త్ సూపర్ వైజర్, ఎంపీడీవో, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విష జ్వరాల పరిస్థితి ఎలా ఉందో..? అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, జ్వరాలు ప్రబలే ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. జ్వర పీడితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెమలిని కాపాడిన అధికారులు

వెల్గటూర్, సెప్టెంబర్ 10: కుమ్మరిపల్లి గ్రామంలోని పొలంలో జాతీయ పక్షి నెమలి గాయపడి ఉండడంతో సదరు రైతు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. రాయపట్నం సెక్షన్ అధికారి సయ్యద్ అమీర్ అలీ వెంటనే పశు వైద్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. నెమలికి ప్రథమ చికిత్స చేయించి నేరెళ్ల అటవీ సెక్షన్ పరిధిలో వదిలిపెట్టారు.

నెమలిని అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న రైతు

వేలం పాట వాయిదా

కోరుట్ల, సెప్టెంబర్ 10: పట్టణంలోని శ్రీ సాయిరామ ఆలయంలో పూజా సామగ్రి విక్రయాల హక్కు కోసం నిర్వహించిన వేలం వాయిదా వేసినట్లు ఏవో కాంతారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, ఆలయ ఆవరణలో ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పూలు, పూలదండలు, కొబ్బరి ముక్కలు పొగు చేసుకునే హక్కు కోసం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. సరైన ధర రాకపోవడంతో వేలం వాయిదా వేశామని, తిరిగి ఈ నెల 16న మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రామాల్లో డ్రైడే

కథలాపూర్, సెప్టెంబర్ 10: అంబారిపేట పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం డ్రై డేగా నిర్వహించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటా తిరిగి ట్యాంకుల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ప్రజలు తమ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు రచన, సిబ్బంది సూచించారు.

నష్టపోయిన పంటల పరిశీలన

కథలాపూర్, సెప్టెంబర్ 10: బొమ్మెన, సిరికొండ, గంభీర్‌పూర్, పోతారం గ్రామాల్లో వర్షాలతో నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు గుర్తించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వ్యవసాయశాఖ మండల నోడల్ అధికారి శేఖర్ తెలిపారు.

సామూహిక సరస్వతీ పూజలు

పూజలు చేస్తున్న మహిళలు

మారుతీనగర్, సెప్టెంబర్ 10: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో మదన్‌శర్మ వేదమంత్రోచ్చరణల మధ్య సామూహిక సరస్వతీ పూజలను మహిళలు నిర్వహించారు. కళ్యాణ కాత్యాయినీదేవి వ్రతం, అభిషేకార్చనతో పాటు భద్రగజలక్ష్మి సరస్వతీ పూజలు చేశారు.

ఆలయానికి విరాళం

కొడిమ్యాల, సెప్టెంబర్ 10: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయానికి కరీంనగర్‌కు చెందిన నరేందర్‌రెడ్డి మంగళవారం రూ.25వేల విరాళం అందించారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా, పూజారి తీర్థప్రసాదాలు అందించారు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన ఠాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. ఠాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు

ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తల నొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

రిజర్వేషన్లు రద్దు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన హత్యాచార ఘటనపై నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. మంగళవారం ఐదు గంటల్లోపు విధుల్లోకి చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. 32వ రోజైన మంగళవారం కూడా విధులు బహిష్కరించి తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు, సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానించారు. దీనిని జూనియర్ డాక్టర్లు తిరస్కరించారు.

కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

నాలుగేండ్లు ఏం చేశారు?

మలయాళ సినీ పరిశ్రమలో మహిళల వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్య తీసుకోకుండా స్తబ్దుగా, నిష్క్రియాత్మకంగా ఉండటం పట్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నివేదిక ఇచ్చిన నాలుగేండ్ల తర్వాత మాత్రమే చర్యలు ప్రారంభించిందని, ఇన్నాళ్లూ ప్రభుత్వం ఏం చేసిందనిజస్టిస్‌లు ఏకే జయశంకరన్ నంబియార్, సీఎస్ సుధాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వెంటనే కమిటీ పూర్తి నివేదికను (సిట్)కు అప్పగించాలని ఆదేశించింది

హేమ కమిటీతో ఆదర్శం: పినరయి

దేశంలోని ఏ రాష్ట్రం చేయని విధంగా చలన చిత్ర పరిశ్రమపై వచ్చిన ఆరోపణలపై తమ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని వేసి ఆదర్శంగా నిలిచిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ దాడిలో 19 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్, సెప్టెంబర్ 10: గాజాలోని ఓ రక్షణ గుడారంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 19 మంది చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఆ గుడారంలో తల దాచుకున్న హమాస్ ఉగ్రవాదులను ఏరివేయడం కోసమే గురి చూసి ఆయుధాలతో దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. మృతుల సంఖ్యపై విభేదించింది. ఇజ్రాయెల్ ప్రకటనను హమాస్ ఖండించింది.

రష్యాకు ఇరాన్ ఆయుధాలు!

లండన్: రష్యాకు ఇరాన్ ఆయుధాలు సరఫరా చేస్తున్నదని అమెరికా, బ్రిటన్ మంగళవారం ఆరోపించాయి. ఉక్రెయిన్‌పై దాడికి ఉపయోగపడేలా ఇరాన్ స్వల్